సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



స్వచ్ఛతకు స్టీల్ సంకల్పం

వివాహాది, ఇతర శుభకార్యాలకు ప్లాస్టిక్, పేపర్ వస్తువులకు బదులుగా స్టీల్ వినియోగమే లక్ష్యంగా మెప్మా అడుగులు వేస్తోంది. 8లో..

అడిషనల్ డీసీపీల నియామకం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ అడిషనల్ డీసీపీగా (లా అండ్ ఆర్డర్) ఎస్.మల్లారెడ్డి నియామకమయ్యారు. అదేవిధంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా విధులు నిర్వహిస్తున్న మహేందర్ డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో అందె శ్రీనివాస్ రానున్నారు. సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎంసెట్ కౌన్సెలింగ్



నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం రెండో విడత ఎంసెట్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు 131మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ చెప్పారు. విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అధికారులు ఐడీ, పాస్‌వర్డ్ అందజేశారు.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. సోమవారం జగదేవ్‌పూర్‌లోని బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్ తదితర అంశాలపై షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీటీమ్‌కు ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 100, 112, 1098 కాల్ చేయాలని, 8712667343 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రమోహన్, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది ఏఎస్‌ఐ అమృత్, సంజీవరెడ్డి, యుగంధర్, జ్యోతి, అన్వేష్ పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

సిద్దిపేటకమాన్: మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పట్టణంలోని బ్రాహ్మణ పరిషత్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వెలుగులో మోతె బిందు సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఈ వైద్య శిబిరంలో మరోసారి పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైనవారికి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. 7,8,9,10,11,12,13,14వ వార్డు ప్రజలు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలి



పుస్తక పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఐఈఓ

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) సూర్యప్రకాశ్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం 14711, ద్వితీయ సంవత్సరం 13,630 పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం, చేర్యాల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సమ్మయ్య, చక్రవర్తి, మాధవి, యమున, రమేశ్ పాల్గొన్నారు.

4న టీషర్ట్స్ అందజేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న హాఫ్ మారథాన్‌కు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు 4, 5వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీషర్టులు, రన్ మెటీరియల్ తీసుకోవాలని రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా నిర్వహిస్తున్న 5కే, 10కే, 21కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడతాం



చిన్నకిష్టాపూర్‌లో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోతామని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ ఆత్మగౌరవ పాదయాత్రలో భాగంగా సోమవారం కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మోసాలను, కాంగ్రెస్ చేపట్టబోయో పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. బంధు పథకాల పేరిట మోసం చేస్తుందన్నారు. ఎన్నికల తర్వాత అన్నీ బంద్ చేస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

భళా.. చేనేత హస్తకళ



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళ







ప్రదర్శనకు ఉంచిన చేనేత వస్తువులు

పట్టణంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటుంది. సోమవారం శివమ్స్ గార్డెన్‌లో దీనిని ప్రారంభించారు. విక్రయాలు ఈ నెల 20 వరకు జరుగుతాయని నిర్వాహకులు శనిగరం కిషోర్, జల్ల సత్యనారాయణ తెలిపారు. వస్తువులు అందుబాటు ధరలో ఉండటంతో ప్రజలు బారులు దీరారు. ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

అపార నష్టం!

తెగిన రోడ్లు.. దెబ్బతిన్న పంటలు
- రెండు పూర్తిగా, 684 పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు
- ఆదుకోవాలంటున్న బాధితులు
- రూ.60కోట్లకు పైగా రోడ్లు, హైలెవల్ వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు



పోతారం(జె) గ్రామంలో వరి చేనులో పేరుకుపోయిన ఇసుక

సాక్షి, సిద్దిపేట: కుండపోతగా కురిసిన వానలు.. ఉగ్ర రూపం దాల్చిన వాగులు.. పంట పొలాల్లో ఏరులై పారిన వరద రైతులను అతలాకుతలం చేశాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. ఇళ్లు కూలి పేదలు నిరాశ్రయులయ్యారు. తీవ్రంగా నష్టపోయిన బాధితులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

అన్నదాతకు తీవ్ర నష్టం

అతివృష్టి అన్నదాతను అతలాకుతలం చేసింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వానలతో వరదలు ఏరులైపారాయి. సాగుకు సిద్ధమైన పొలాల్లో ఇసుక పర్చుకోవడంతో తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ఇసుక వల్ల భూమి సారవంతం గణనీయంగా దెబ్బతిని దిగుబడి పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.80 లక్షలకు పైగా పంటలు సాగయ్యాయి.

రోడ్లు ధ్వంసం



కోహెడ మండలం పోరెడ్డిపల్లిలో కోతకు గురైన రోడ్డు

వర్షాలకు రోడ్లు కొట్టుకుపోవడంతో పాటు కోతలకు గురయ్యాయి. నష్టం సుమారు రూ.60 కోట్లకు పైగా ఉంటుందని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేసి ఉన్నత స్థాయికి ప్రతిపాదనలు పంపించారు. వరద తాకిడికి రోడ్లు కోతకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెజ్జంకి క్రాస్ రోడ్ నుంచి కొండాపూర్, ఇబ్రహింపూర్- దుబ్బాక(వయా గోనెపల్లి రోడ్), వల్లంపట్ల- తరిగొప్పుల, హుస్నాబాద్- అక్కన్నపేట, తంగళ్లపల్లి- బద్దిపడగ, కోహెడ- దేవక్కపల్లి, హుస్నాబాద్- రామవరం, పోచారం- బెజ్జంకి రోడ్, మొండ్రాయి-నాగరాజుపల్లి, సూరంపల్లి-నాచారం రోడ్లు దెబ్బతిన్నాయి.



మిరుదొడ్డిలో కూలిపోయిన ఇల్లు

పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 684ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉండటంతో బంధువుల నివాసాలకు కొందరు వెళ్లగా... మరికొందరు అందులోనే బిక్కు బిక్కు మంటూ జీవనం గడిపారు. ఆయా శాఖలు సొకర్యాల పునరుద్ధరణ చర్యలో తలమునకలై ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఆదుకునేందుకు రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతస్థాయికి పంపాయి. మరో రెండు మూడు రోజుల్లో వారికి ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిలువ నీడ లేదు



మాది నిరుపేద కుటుంబం. ఇటీవల కురిసిన వానలకు ఇల్లు మొత్తం కూలిపోయింది. ఇప్పుడు నిలువ నీడ లేదు. తడిసిన గోడల మధ్య ఉండాలంటే భయంగా ఉంది. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి. -మొగుళ్ల కోటి, మిరుదొడ్డి

పొలమంతా ఇసుక మేటలే...



నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేశా. భారీ వర్షానికి ఉధృతంగా వరద రావడంతో పొలంలో ఇసుక మేటలు, బురద చేరింది. ఎకరం పొలంలో ఇసుక మేటలు వేసింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.
– బంక సంపత్, పోతారం(జె), రైతు

జిల్లాకు మరో గురుకులం

- అక్కన్నపేట మండలానికి ఎస్టీ బాలికల రెసిడెన్షియల్ మంజూరు
- 39కి చేరిన గురుకులాల సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



అక్కన్నపేట(హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలానికి ఎస్టీ బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల మంజూరైంది. సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అందులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 38గురుకులాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 39కి చేరుకుంది. గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్యను అందుబాటులో తీసుకువచ్చేందుకు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రత్యేక చొరవతో అక్కన్నపేట మండలానికి ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల మంజూరు చేయించారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజనులు అత్యధికంగా ఉంటారు. అదేవిధంగా అక్కన్నపేట మండలంలో తండాలు కూడా అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పాఠశాలలు అందుబాటులో లేక అనేకమంది గిరిజన బిడ్డలు చదువుకు దూరమయ్యారు. ప్రస్తుతం గురుకుల పాఠశాల అందుబాటులోకి రావడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎస్టీ బాలికల గురుకులం మంజూరుకు కృషి చేసిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు. సమైక్యాంధ్ర పాలకులు గిరిజనులను పట్టించుకోలేదు.
– మాలోతు లక్ష్మీ, ఎంపీపీ, అక్కన్నపేట మండలం

సత్వర పరిష్కారానికి చొరవ చూపాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం 58 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రెహమన్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి చెరువుకు గతేడాది పడిన గండిని పూడ్చాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువు గండి నుంచి వస్తున్న వరద కారణంగా పంట పొలాలు పాడవుతున్నాయని తెలిపారు. అలాగే గౌరవెల్లి ప్రాజెక్టు వద్దకు వస్తున్న భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని చెప్పారు. అదేవిధంగా మల్లన్న సాగర్ అదనపు టీఎంసీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం అందిస్తానన్న రెండో విడత నష్టపరిహారం త్వరగా అందించాలని తొగుట మండలం, ఎల్లారెడ్డిపేట గ్రామ భూ బాధితులు ఫిర్యాదు చేశారు.

నర్మేటలో ఇనుము బట్టి

నంగునూరు (సిద్దిపేట): మండల పరిధిలోని దేవుని నర్మేటలో 17వ శతాబ్దం నాటి ఇనుము బట్టీని గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీనివాస్ తెలిపాడు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామ శివారులో పూర్వకాలంలో ఇనుము బట్టిలో తయారైన ఇటుకలతో కాల్చి మట్టి గొట్టాలతో నిర్మించినట్లు తెలుస్తోందని చెప్పారు. ఇటుక 7.8 అంగుళాల పొడవు, 4 ఫీట్ల వెడల్పు, మూడు అంగుళాల మందంతో తయారైందన్నారు. మట్టి గొట్టాల్లో అమర్చడానికి ఇటుకలను అర్ధ వృత్తాకారంలో గాడులను తయారు చేశారని చెప్పారు. గొట్టాల్లో కరుక్కున్న ఇనుమును పరిశీలించగా అందులో కరిగించిన ఇనుము ప్రవహించేలా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి బట్టీలను ఇతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కోన సముద్రంలో లభించాయన్నారు.



ఇటుక గొట్టంలో ఉన్న ఇనుము

దుబ్బాక ఆస్పత్రికి మహర్దశ



దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రి

- 71 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దుబ్బాకటౌన్: దుబ్బాక వంద పడకల ఆస్పత్రికి మహర్దశ పట్టనుంది. తాజాగా ఈ ఆస్పత్రికి 71 పోస్టులు మంజూరు చేస్తూ సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పుట్టిపెరిగి ఇంతటి స్థాయికి తీసుకొచ్చిన దుబ్బాక గడ్డ రుణం తీర్చుకుంటానని ప్రకటించిన సీఎం కేసీఆర్.. అప్పటివరకు 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.20 కోట్ల నిధులుమంజూరు చేశారు. వాటితో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కృషితో అన్ని హంగులతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యింది. 2021 డిసెంబర్ 25న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అయినా సరిపడా సిబ్బంది లేక ప్రజలకు వైద్య సేవలు సరిగా అందేవి కావు. ఎట్టకేలకు పోస్టులు మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే వివిధ రకాల సర్జరీలు, మెరుగైన వైద్య సేవలు, 5 పడకల డయాలసిస్ సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా పేరుగాంచింది.

విప్లవాత్మక మార్పులు



సీఎం కేసీఆర్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి 71 పోస్టులు మంజూరయ్యాయి. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందనున్నాయి. ఆమోదం తెలిపిన సీఎంకు, కేబినెట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
– వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సంతోషకరం



దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో కేబినెట్‌లో కొత్తగా 71 పోస్టులు మంజూరి చేయడం చాలా సంతోషకరం. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు దుబ్బాక ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.
–ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఆర్టీసీలో సంబురాలు

- ప్రభుత్వ విలీన నిర్ణయంతో కార్మికుల్లో హర్షాతిరేకాలు
- ఉమ్మడి జిల్లాలో 2,600 మందికి లబ్ధి



సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగుల సంబురాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయం ఆ సంస్థ ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి రీజియన్) పరిధిలో సుమారు 2,600 మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో సుమారు 750 డ్రైవర్లు, 1,100 మంది కండక్టర్లు ఉన్నారు. మెకానిక్‌లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, క్లర్కులు ఇలా వివిధ విభాగాల్లో మరో 750 వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం ఎనిమిది ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాకలో బస్ డిపోలున్నాయి. నిత్యం లక్షకుపైగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. మరోవైపు ఆర్టీసీ సంస్థకు ఉమ్మడిజిల్లాలో రూ.వేల కోట్లు విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సిద్దిపేట డిపో ఎదుట..

సిద్దిపేటకమాన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన నిర్ణయం పట్ల సిద్దిపేట డిపో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపోలో సోమవారం టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. సిద్దిపేట డిపోలో 184 మంది కండక్టర్లు, 106 మంది డ్రైవర్లు, 40 మంది మెకానిక్‌లతో పాటు మొత్తం 420 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ డిపోలో 200 మంది, దుబ్బాక డిపోలో 170 మంది ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించనున్నారు.

సంతోషంగా ఉంది



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. మా కష్టాన్ని గుర్తించినందుకు సీఎం, మంత్రి హరీశ్‌రావు కృతజ్ఞతలు.
– ఎండీ మౌలానా, ప్రధాన కార్యదర్శి, ఎస్‌డబ్ల్యూయూ

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం వల్ల అన్ని సంక్షేమ పథకాలు అందుతాయి. మా ఉద్యోగానికి, కుటుంబానికి ధీమా ఉంటుంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– భగవాన్‌రెడ్డి, అసిస్టెంట్ మెకానిక్, సిద్దిపేట డిపో

క్లుప్తంగా

ట్రాలీ ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడ కమాన్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణమూర్తి(70) గత అనేక ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం అమీన్‌పూర్‌కు వలసొచ్చాడు. ఓ ప్రైవేట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసుకునేవాడు. ఆదివారం రాత్రి పట్టణంలోని బీరంగూడ చౌరస్తా వద్ద జాతీయరహదారి దాటుతుండగా లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వస్తోన్న గుర్తు తెలియని ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కృష్ణమూర్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. సోమవారం మృతుడి కుమారుడు ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మరో వృద్ధుడు..

జిన్నారం(పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని అండూర్‌లో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అండూర్‌కు చెందిన ఉప్పరి చంద్రయ్య (76) ఉదయం సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు సమీపానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడగా, గమనించిన స్థానికులు బయటకు తీశారు. అప్పటికే అతడు మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదని తెలిపారు.

రేగోడ్ ఎంపీడీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రేగోడ్(మెదక్): రేగోడ్ఎంపీడీఓ సీతారావమ్మపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని ఎంపీపీ సరోజన సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీడీఓ తనకు ఎలాంటి సమాచారమూ ఇవ్వడం లేదన్నారు. తాను దళిత ప్రజా ప్రతినిధినని, తనతో నిర్లక్ష్యంగా మాట్లాడుతోందని వాపోయారు. ఆమె విధులకు కూడా సరిగా హాజరు కావడం లేదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కార్యాలయానికి ఎప్పుడు వస్తారో? తిరిగి ఎప్పుడు వెళ్తారో? కూడా తెలియడం లేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి, ఎంపీడీఓ తీరుపై విచారణ చేపట్టాలని పేర్కొన్నారు.

యువకులపై కేసులు ఎత్తేయాలి



మాట్లాడుతున్న ఖమ్మం వెంకటేశం

కోహెడ(హుస్నాబాద్): కోహెడకు 108 అంబులెన్స్ కేటాయించాలని కోహెడ యువత ధర్నా చేయగా వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తి వేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 25న కోహెడకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు నెలరోజుల్లో అంబులెన్స్ కేటాయిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. అయితే 5 నెలలు గడుస్తున్నా అంబులెన్స్ మంజూరు జాప్యంపై యువత నిరసన తెలిపారన్నారు. వీరిపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తేసేలా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, రమేశ్, శ్రీనివాస్, జగన్, సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జావలిన్ త్రో, 100మీ, 400మీ పరుగు పందం పోటీలు అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు 9704661898 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛతకు స్టీల్ సంకల్పం

- హుస్నాబాద్‌లో మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు
- వివాహాది శుభకార్యాలకు అద్దెకు వస్తువులు
- మహిళా సభ్యులతో ప్రచారం



వస్తువులను క్రమపద్ధతిలో పేర్చుతున్న మెప్మా సభ్యులు

వివాహాది, ఇతర శుభకార్యాలకు ప్లాస్టిక్, పేపర్ వస్తువులకు బదులుగా స్టీల్ వినియోగమే లక్ష్యంగా మెప్మా అడుగులు వేస్తోంది. స్టీల్ వస్తువులు తక్కువ అద్దెకు ఇవ్వబోతోన్నది. స్వచ్ఛ హుస్నాబాద్ ధ్యేయంగా ముందుకు దూసుకు పోతున్నది.

హుస్నాబాద్ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హుస్నాబాద్ మున్సిపాలిటీకి రెండుమార్లు జాతీయ అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ హుస్నాబాద్ లక్ష్యంగా ప్రజలకు స్టీల్ బ్యాంక్‌ను మెప్మా ఆధ్వర్యంలో అందుబాటులోకి తెస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట పట్టణంలో మొదటిసారిగా స్టీల్ బ్యాంక్ ఏర్పాటైంది. రెండోది హుస్నాబాద్‌లో ఏర్పాటైంది. త్వరలో ప్రారంభం కాబోతోంది. పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ కవర్లు వద్దు.. స్టీల్‌ప్లేట్లు ముద్దు అనే నినాదాన్ని పిలుపునిస్తోంది.

పలు దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల అమ్మకాలు

మున్సిపల్ అధికారులు పర్యావరణ పరిరక్షణ కోసం శ్రమిస్తున్నా పలు దుకాణాల్లో పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలు తగ్గడం లేదు. ప్రతి వివాహ శుభకార్యాలకూ తప్పనిసరిగా పేపర్ ప్లేట్లు, తాగునీటి కోసం ప్లాస్టిక్ గ్లాసులు వాడుతున్నారు. అడపాదడపా ప్లాస్టిక్ వస్తువులు కట్టడికి తనిఖీలు చేస్తున్నా పూర్తిస్థాయిలో నియంత్రించ లేకపోతున్నారు. హోటళ్లు, వైన్స్ సిట్టింగ్‌లు, పండ్ల దుకాణాలు, పలు దుకాణాల్లో ఎక్కడ చూసినా ప్యాకింగ్ కోసం ప్లాస్టిక్ వస్తువులనే వాడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులు, పేపర్ ప్లేట్లను పూర్తిగా కట్టడి చేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కానుందని తెలుస్తోంది.

అద్దెకు స్టీల్ వస్తువులు

మెప్మా ఆధ్వర్యంలో వివాహాలు, ప్రతి ఇంటిలో జరిగే శుభ కార్యాలయాలకు కావాల్సిన వంట సామానులు, గ్లాస్‌లు, ప్లేట్లు కారుచౌకగా అద్దె ప్రాతిపదికన స్టీల్ బ్యాంక్ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్టీల్‌కు సంబంధించి ప్లేట్లు, గ్లాసులు, బేసిన్లు, కప్స్, టిఫిన్ ప్లేట్లు, టీస్పూన్స్, బకెట్లు, రైస్ సర్వీసింగ్ గరిటెలు, కర్రి స్పూన్స్, డొంగాలు, వాటర్ జెగ్‌లు, జాలి టబ్స్, స్టీల్ ట్రె ఇలా పలు వస్తువులను అందుబాటులోకి తెచ్చారు. సుమారు వెయ్యి మందికి సరిపడే స్టీల్ వస్తువులు అందుబాటులో ఉన్నాయి. బయట టెంట్‌హౌస్‌లో ఉండే వస్తువుల అద్దెలతో పోల్చితే తక్కువ ధరలకు ఇవ్వనున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసమే



హుస్నాబాద్ పట్టణంలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కోసం మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశాం. బయట టెంట్ హౌస్‌ల కంటే స్టీల్ బ్యాంక్‌లో అద్దెకు తీసుకునే వస్తువులు అతి తక్కువ ధరలకు ఇస్తాం. ఆఫీస్ రోడ్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశాం. రెండు లేదా మూడు రోజుల్లో స్టీల్ బ్యాంక్‌ను ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. మెప్మా మహిళా సభ్యులతో ప్రచారం చేయిస్తున్నాం.

రాజు, మెప్మా సీఓఓ,
హుస్నాబాద్

దోపిడీ కేసులో ముగ్గురు రిమాండ్

- కారు, బైక్, 3 సెల్ ఫోన్లు స్వాధీనం : ఎస్పీ రమణకుమార్



మాట్లాడుతున్న ఎస్పీ రమణకుమార్, పక్కన డీఎస్పీ పురుషోత్తంరెడ్డి

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన నిందితులను బీడీఎల్ భానూర్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రమణకుమార్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. ఎంపీఆర్ అర్బన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రవికుమార్ ఈనెల 22న మాదాపూర్‌లో మైండ్స్ ప్లేస్ కంపెనీలో విధులు ముగించుకొని, రాత్రి 11.30 ప్రాంతంలో పాటి చౌరస్తాలో బస్సు నుంచి దిగి, ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. అను ఫర్నిచర్ సమీపంలో ఇద్దరు స్కూటీపై వచ్చి దాడి చేశారు. ఈ దాడిలో అతడి సెల్ ఫోన్, జేబులో ఉన్న పర్సు లాక్కొని పరారయ్యారు. పర్సులో రూ. 10 వేలు నగదు, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డులున్నాయి. వెంటనే బాధితుడు బీడీఎల్ భానూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి సంగారెడ్డి ఇండియన్ ఏటీఎం ద్వారా రూ.50 వేలు, సదాశివపేట ఎస్బీఐ ఏటీఎం నుంచి రూ.40 వేలు నగదు తీసినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సీసీ ఫుటేజీ ఆధారంగా కారు నంబర్‌ను గుర్తించారు. ఈనెల 30న పాటి చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా కారును, వెనుకాల వచ్చిన స్కూటీని పట్టుకున్నారు. నిందితులు పటాన్‌చెరుకు చెందిన మహ్మద్ అసిఫ్, వినయ్ పాటిల్, మనిదీప్‌రెడ్డి పారిపోయేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తామేనని వారు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి, వారి నుంచి కారు, బైక్, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ రవీందర్ రెడ్డి సిబ్బంది భాస్కర్, రవీందర్, గోవర్ధన్, పాండురంగంలను అభినందించారు.

డ్రెస్సింగ్ చేయకుండానే కుట్లు!

- చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలి నిర్లక్ష్యమంటూ బాధితుడి ఆరోపణ
- ఎక్స్‌రేలో 5 గాజు పెంకులున్నట్లు గుర్తించిన వైనం



వైద్యురాలిని నిలదీస్తున్న బాధితుడు సురేశ్

చేర్యాల(సిద్దిపేట): గాయానికి డ్రెసింగ్ చేయకుండా కుట్లు వేసిన ఉదంతం సోమవారం ఆలస్యంగా మండలంలో వెలుగుచూసింది. పట్టణానికి చెందిన బాధితుడి సురేశ్ కథనం ప్రకారం.. తుమ్మ సురేశ్ పది రోజుల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యురాలు, సురేశ్ చేతికైన గాయానికి డ్రెస్సింగ్ చేయకుండానే కుట్లు వేశారని ఆరోపిస్తున్నాడు. గాయం తగ్గకపోగా నొప్పి వస్తోందని ఓ ప్రైవేటులో చూపించుకున్నాడు. అక్కడ ఎక్స్‌రే తీయించగా ఐదు గాజు పెంకులున్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అవాక్కయిన సురేశ్ సోమవారం చేర్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేసిన వైద్యురాలు మంజులను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితుడు వాపోయాడు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మెల్సీకి ల్యాబ్ టెక్నీషియన్ల వినతి



ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ వైద్యారోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న తమ సేవలను గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ల్యాబ్ టెక్నీషియన్లు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ల్యాబ్‌టెక్నీషియన్లు మాట్లాడుతూ, సుమారు 580 మంది ల్యాబ్ టెక్నీషియన్లు డీఎస్సీ ద్వారా ఎంపికై గత 22 ఏళ్లుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కరోనాలోనూ 24 గంటలపాటు అందుబాటులో ఉన్నా గానీ ఉద్యోగ భద్రత లేకపోవడంపై ఆందోళనకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి వైద్యుల మాదిరిగానే వెయిటేజ్ మార్కులు ఇచ్చి క్రమబద్ధీకరించాలని, హెల్త్ కార్డులు లేదా హెల్త్ ఇన్సూరెన్స్, సమాన పనికి సమాన వేతనం, పీఆర్సీ పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ల రాష్ట్ర కార్యదర్శి శ్రీలత, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రీతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోపాల్, ప్రచార కార్యదర్శి వినయ్‌జోసెఫ్, టెక్నీషియన్లు అంబిక, సౌందర్య, ఇమ్రాన్, వంశీ పాల్గొన్నారు.

కన్నతండ్రిని కడతేర్చాడు

- తాగేందుకు డబ్బులివ్వలేదని కర్రతో కొడుకు దాడి
- చికిత్సపొందుతూ మృతి
- మాచిరెడ్డిపల్లిలో వెలుగుచూసిన ఘటన



చాకలి నర్సింహులు

కోహీర్(జహీరాబాద్): మద్యంమత్తులో విచక్షణ జ్ఞానం కోల్పోయి కొడుకు తండ్రిని కర్రతో కొట్టి చంపాడు. ఈ ఉదంతం మండలంలోని మాచిరెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి నర్సింహులు (55)కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య లక్ష్మి పిచేర్యాగడి తండాలో అంగన్వాడీ టీచర్ గా పనిచేస్తోంది. నర్సింహులు కూలీ పనిచేసేవాడు. తన ఇద్దరు కొడుకుల వివాహాలు చేసేశాడు. పెద్ద కొడుకు ప్రదీప్, కోడలు హైదరాబాద్ ఉంటున్నాడు. చిన్నకొడుకు దిలీప్‌నకు మండలంలోని పిచెర్యాగడి నివాసి కవితతో మూడేళ్ల క్రితం వివాహమైంది. భర్త దిలీప్ ప్రవర్తన బాగు లేకపోవడంతో పాటు తాగుడుకు బానిసయ్యాడు. దీంతో కవిత అతడిని విడిచి పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులను తాగడానికి డబ్బులు అడగడంతోపాటు పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకురమ్మని తరుచూ గొడవపడేవాడు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తాగొచ్చి మరలా తాగేందుకు డబ్బులు ఇవ్వమని వేధించాడు. నిరాకరించిన తండ్రి నర్సింహులుపై కర్రతో దాడి చేయగా తలకు గాయమైంది. వెంటనే అతడిని కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అతడు అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

బీరంగూడలో ఘటన



ప్రేమ్ కుమార్

పటాన్ టౌన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్పూర్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం... బీరంగూడలో ఉన్న భ్రమరాంబ కాలనీలో నివాసముండే సివిల్ ఇంజినీర్ కోటగిరి ప్రేమకుమార్ జూలై 28న ఇంటి నుంచి వెళ్లి రాలేదు. భార్య రేణుక తెలిసిన వారిని, బంధువులను విచారించినా భర్త ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత పద్ధతే కొనసాగించాలి



ధర్నా చేస్తున్న గ్రామసేవకులు

- ఓటాబందీ గ్రామసేవకుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిద్దిపేటరూరల్ : ఓటాబందీ గ్రామ సేవకులను తొలగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, పాత పద్ధతిలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఓటాబందీ గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాల్వ నరేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఓటాబందీ గ్రామ సేవకులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తహసీల్దార్ కార్యాలయాలల్లో గ్రామ మస్కూరిగా, నీరటిగా వంతులవారీగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మండలానికి 110 మంది అసలుదారులు ఉండగా, వారి కింద వంతులవారీగా సంవత్సరానికి ఒక్కొక్కరు చొప్పున 1,100 మంది కుటుంబాలు విధులు నిర్వహిస్తూ జీవిస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల క్రమంలో అసలుదారులకు పేస్కేల్ అమలు చేసి, అకౌంట్‌లో జీతాలు జమ చేయడం మూలంగా ఓటాబందీ గ్రామసేవకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అసలుదారుల జీవో రద్దు చేసి, పాత పద్ధతిలో వంతుల వారీగా విధులు నిర్వహించేలా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఓటాబందీ గ్రామసేవకుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఆరుగురి బలవన్మరణం

వేర్వేరుచోట్ల ఆరుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వర్గల్, పటాన్‌చెరు, నిజాంపేట, నర్సాపూర్‌రూరల్, చిలప్‌చెడ్, పెద్దశంకరంపేటల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

పురుగుల మందుతాగి భర్త మృతి



శ్యామ్

వర్గల్(గజ్వేల్): సీతారాంపల్లికి చెందిన భార్యాభర్తలు చిల్లా శ్యామ్(26), భార్య అవంతిక మధ్య ఆర్థిక ఇబ్బందులతో మనస్పర్థలు ఏర్పడగా, తున్కిఖాల్సా శివారులో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యం చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా 2 నెలలుగా శ్యామ్ ఏ పని చేయకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి.

మతిస్థిమితం సరిగా లేక యువకుడు..

పటాన్‌టౌన్: మతిస్థిమితం సరిగా లేక దయ్యార పంచాయతీ గండిగూడకు చెందిన నిరుడి గణేష్ గ్రామ పరిధిలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అతడి మానసిక పరిస్థితి సరిగాలేదు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి



దేవరాజు

నిజాంపేట(మెదక్): అప్పులబాధతో నందగోకుల్‌కు చెందిన దేవరాజు(35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు దేవరాజు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పనిమీద ఇంటికొచ్చాడు. ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

యువతి...

నర్సాపూర్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లాపూర్‌కు చెందిన మంగలి లక్ష్మి రెండో కూతురు ప్రవాళి(20) ఆదివారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. తల్లి లక్ష్మి కూలీ పనులు చేస్తూ ముగ్గురు కూమార్తెలను పోషిస్తోందని గ్రామస్తులు తెలిపారు.

క్షణికావేశానికి నిండు ప్రాణం బలి



నాగలక్ష్మి

పెద్ద శంకరంపేట(మెదక్): ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్న ఉబ్బి నాగలక్ష్మి (19) తల్లితో గొడవపడి క్షణికావేశంలో బతుకమ్మ కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మొహర్రం పండగ ముందు రోజు బంధువుల ఇంటికి వెళ్లేందుకు తల్లితో ఈ విషయమై గొడవైంది.

ప్రేమ వ్యవహారంపై మందలింపు..



కల్పన

చిలప్‌చెడ్ (నర్సాపూర్): ప్రేమ విషయం తెలిసి తన పెదక్క స్వాతి మందలించిందని చెల్లెలు కల్పన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. వీరు చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లికి చెందిన వారు. కల్పన ఇంటర్ వరకు చదివింది. కాగా జోగిపేటలోని తన పెద్దక్క స్వాతి వద్ద ఉండి సంగారెడ్డిలోని ఓ బ్యూటీపార్లర్‌లో వర్క్ నేర్చుకునేది.

అసెంబ్లీని ముట్టడిస్తాం: సీఐటీయూ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ సిబ్బంది, సీఐటీయూ నాయకులు

సిద్దిపేటరూరల్: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశ కార్యక్రమాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య హెచ్చరించారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 రోజులుగా జీపీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపాలన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్మికుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీపీఓకు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, తునికి మహేష్, చొప్పరి రవికుమార్, అమ్ముల బాల్ నర్సయ్య, బర్మా కొమురయ్య, యాదగిరి, మల్లయ్య, సాయిలు, వెంకటరెడ్డి, దుర్గయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రచనలపై దృష్టి సారించాలి

- డాక్టర్ సీహెచ్ ప్రసాద్

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యా విషయ పరిజ్ఞానం పెంపొందించే నూతన ఆవిష్కరణలపై అధ్యాపకులు దూరదృష్టితో రచనలు కొనసాగించాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ గోపాలసుదర్శనం రచించిన వ్యాపార గణాంక శాస్త్రం అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు రచయితను అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

లబ్ధిదారుల నుంచి వసూళ్లు తగవు

– ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న అడివయ్య

కొండాపూర్(సంగారెడ్డి): సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సంక్షేమ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని, అవినీతిపై విచారణ జరపాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకుల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా పథకాలు పొందుతున్న లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

కొండపాక(గజ్వేల్): విద్యాసంస్థల్లో సమస్యలు మరింతగా పేరుకుపోయేలా జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కొండపాకలో ఆయన సోమవారం మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియా వారిని అనుమతించొద్దని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనా నిషేధం విధించేలా సర్క్యులర్ జారీ చేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లా అధికారులు పని చేయడం బాధాకరమన్నారు. వెంటనే సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.